
సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 7 । జూలై । 2024



పొంగుతున్న వాగులు

ఏజెన్సీ ప్రాంతంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొండ వాగులు, కాలువలు పొంగి పొర్లుతున్నాయి. జలాశయాల్లోకి వరద నీరు వస్తోంది. 8లో ▸



గోవిందుడి చెంత గోసంరక్షణ

గో సంరక్షణకు ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం పెద్దపీట వేసింది. దేశీయ జాతి ఆవుల పోషణ, వాటి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. 8లో ▸



భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఆదివారం భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని ఆలయ వర్గాలు చెబుతున్నాయి.

న్యూస్‌రీల్

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



జిల్లా కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్

ఏలూరు (టూటౌన్): ప్రస్తుత సమాజంలో కాలుష్యం బాగా పెరిగిపోయిందని మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం ఆయన న్యాయమూర్తులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటారు వాహనాల వినియోగం, కర్మాగారాలతో కాలుష్యం పెరిగిపోతుందన్నారు. ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని సూచించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్యాన్సర్ శిక్షణ



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న వైద్య సిబ్బంది

భీమవరం (ప్రకాశం చౌక్): వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశాఖ సిబ్బందికి చేపట్టిన క్యాన్సర్‌పై అవగాహన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. గత నెల 13 నుంచి బ్యాచ్‌ల వారీగా తణుకు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యక్రమాల పర్యవేక్షణ అధికారి ధనలక్ష్మి పర్యవేక్షణలో శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలో మెడికల్ ఆఫీసర్లు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు శిక్షణకు హాజరయ్యారు. ముగింపు సందర్భంగా డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు మాట్లాడుతూ నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌లు తదితరాలపై అవగాహన కల్పించామన్నారు. మత్తు పదార్థాలు, మద్యం, గుట్కా, ఖైనీ, తంబాకు వంటి వాటి ద్వారా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలన్నారు.

248 మి.మీ వర్షపాతం

భీమవరం: జిల్లాలో 24 గంటల వ్యవధిలో 248 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సమాచారశాఖ తెలిపింది. నరసాపురంలో అత్యధికంగా 47.2 మిల్లీమీటర్ల వర్షం కురవగా మొగల్తూరులో 33.2, పాలకొల్లులో 32.6, యలమంచిలిలో 22.4, పోడూరులో 20.6, పాలకోడేరులో 18.4 ఆచంటలో 16, పెనుగొండలో 2, ఆకివీడులో 8, ఉండిలో 7.4, వీరవాసరంలో 9, భీమవరంలో 6.4, తాడేపల్లిగూడెంలో 6.2, కాళ్లలో 2.4, పెంటపాడులో 4.4,ఇరగవరంలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీసు పునరుద్ధరణ

తణుకు టౌన్: జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సర్వీసు పునరుద్ధరణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఐడీ కళాశాల, తణుకు ప్రభుత్వ ప్రిన్సిపాల్ పి.అనిల్‌కుమార్ శనివారం తెలిపారు. అభ్యర్థులు గత ఏప్రిల్ 30 నాటికి కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేస్తూ ఉండాలన్నారు. ఈనెల 9న సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో అందజేయాలని కోరారు. ఆయా కళాశాలలకు వచ్చిన దరఖాస్తులను జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈనెల 11లోపు పంపాలన్నారు. ఈ నెల 15న కలెక్టరేట్‌లో ఎంపిక కమిటీ సమక్షంలో అభ్యర్థులకు ఎంపిక చేస్తారన్నారు.

హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ

భీమవరం: వసతి గృహాల్లో విద్యార్థులు ఇబ్బందులు లేకుండా విద్యనభ్యసించేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్ సి.నాగరాణి ఆదేశించారు. శనివారం భీమవరం గునుపూడి ప్రాంతంలోని బీసీ, ఎస్సీ ప్రీ మెట్రిక్, ఎస్సీ గరల్స్ కాలేజీ హాస్టల్ క్యాంపస్, శివరావుపేటలోని ఎస్సీ కళాశాల బాయ్స్ హాస్టల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టళ్ల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన వసతిపై అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నాణ్యమైన భోజనం అందించాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతిరావు, జిల్లా అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి సీహెచ్ భానుమణి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, భీమవరం డివిజన్ అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారి కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

వహ్వా.. బిర్యానీ

సండే స్పెషల్

వివాహం.. రిసెప్షన్.. ఎంగేజ్‌మెంట్.. బర్త్‌డే పార్టీ.. గెట్ టు గెదర్.. మ్యారేజ్ డే సెలబ్రేషన్స్.. ఇలా వేడుకైనా.. వినోదమైనా.. అందరికీ పసందైన విందు వేడి వేడి బిర్యానీయే.. మాంసాహారులే కాదు శాకాహారులు సైతం లొట్టలేసుకుంటూ ఆరగించే రుచికరమైన వంటకం ఇది. బిర్యానీ ఘుమఘుమలకు ముక్కుపుటాలు ఎగరేయని వారుండరు. పల్లె నుంచి పట్టణం దాకా.. కాకా హోటల్ నుంచి ఫైవ్‌స్టార్ హోటల్ వరకూ మెనూలో బిర్యానీ ఉండి తీరాల్సిందే.. పేరుకు పర్షియా వంటకం అయినా అందరికీ ప్రియంగా మారడంతో వంటల్లో రారాజుగా వర్ధిల్లుతోంది. స్థానిక రుచుల్లో అంతర్భాగమై వహ్వా.. అనిపిస్తోంది. నేడు ప్రపంచ బిర్యానీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఆహా ఏమి రుచి

- ఒకప్పటి పర్షియన్ వంటకం
- నేడు జిల్లా రుచుల్లో అంతర్భాగం
- ఉమ్మడి జిల్లాలో 4,500కు పైగా బిర్యానీ సెంటర్లు, రెస్టారెంట్లు
- రోజుకు రూ.5 కోట్లకు పైగా అమ్మకాలు
- ఆన్‌లైన్ ఆర్డర్లలో చికెన్ బిర్యానీదే అగ్రస్థానం
- నేడు ప్రపంచ బిర్యానీ దినోత్సవం



చికెన్ బిర్యానీ

సాక్షి, భీమవరం: బిర్యానీ అనే పదం 'బిరింజ్ బిరియాన్' (ఫ్రైడ్ రైస్) అనే పర్షియన్ పదం నుంచి పుట్టింది. మొఘల్ చక్రవర్తుల ద్వారా మన దేశంలోకి బిర్యానీ వచ్చిందన్న ప్రచారం ఉంది. చరిత్రకారులు చెప్పేదాని ప్రకారం బిర్యానీ వంటకం మొఘల్ శకంలో చక్రవర్తి షాజహాన్ భార్య బేగం ముంతాజ్ మహల్ కాలం నాటిది. పోషకాహార లోపంతో కనిపించిన తమ సైనికులను చూసి, వారి కోసం పోషకమైన, చక్కటి సమతుల్య భోజనాన్ని తయారు చేయమని వంటవాళ్లను మొఘల్ చక్రవర్తి ఆదేశించారు. దాని ఫలితంగా సుగంధ ద్రవ్యాలతో కూడిన బిర్యానీ వంటకం రూపొందిందని చెబుతుంటారు. మరికొన్ని కథలూ ప్రాచుర్యంలో ఉన్నాయి. ఏదీఏమైనా.. నవాబుల కుటుంబాలకే పరిమితమైన బిర్యానీ నెమ్మదిగా తన రూపం మార్చుకుంది. భిన్నమైన ప్రాంతాల్లోని ప్రజల ఇష్టాలకు అనుగుణంగా విభిన్న సుగంధ ద్రవ్యాలను తనలో కలుపుకుంటూ ప్రతిఒక్కరికి కమ్మని రుచితో చేరువైంది. ఏటా జూలై మొదటి ఆదివారం ప్రపంచ బిర్యానీ దినోత్సవంగా పాటిస్తారు.

జిల్లావాసుల అభిరుచులకు తగ్గట్టు..

ఆతిథి మర్యాదలు, విందు భోజనాలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పెట్టింది పేరు. ఎప్పటికప్పుడు సరికొత్త రుచులు ఆరగించేందుకు ఇక్కడి ప్రజలు ఆసక్తి కనబరుస్తుంటారు. అందుకు తగ్గట్టుగానే కొన్ని దశాబ్దాల క్రితం ఈ ప్రాంతానికి పరిచయమైన బిర్యానీ జిల్లా ప్రజల అభిరుచులకు అనుగుణంగా రూపాంతరం చెందుతోంది. చికెన్ బిర్యానీ నుంచి ఎగ్, మటన్, ప్రాన్స్, ఫిష్, దూపుడుపోతు గొర్రె ఇలా నాన్‌వెజ్‌లోని అన్ని మాంసాహారాలను తనలో కలుపుకుంది. ధమ్ బిర్యానీ, ఫ్రైపీస్ బిర్యానీ, చిట్టిముత్యాల బిర్యానీ, నూకల బిర్యానీ, ఉలవచారు బిర్యానీ, గోంగూర బిర్యానీ అంటూ ఎన్నో రకాల వెరైటీల్లో, జంబో బిర్యానీ, కాంబో బిర్యానీ, కుండ బిర్యానీ, పాట్లం బిర్యానీ, బకెట్ బిర్యానీ అంటూ వివిధ రూపాల్లో ఎప్పటికప్పుడు సరికొత్తగా నోరూరిస్తోంది. భీమవరం సీతయ్య పలావ్ సెంటర్, వెంప రాజుగారి దూపుడుపోతు బిర్యానీ, నాయుడుగారి కుండ బిర్యానీ, ఏలూరు అప్పలరాజు హోటల్.. అంటూ ప్రాంతాల వారీగా, వర్గాల వారీగా, రకాల వారీగా ప్రాచుర్యం పొందుతూ విందు చేస్తోంది.

చికెన్ బిర్యానీయే నంబర్‌వన్

బిర్యానీల్లో ఎన్ని వెరైటీలొచ్చినా చికెన్ బిర్యానీకి ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. స్నేహితులతో బయటకు వెళ్లినా.. ఫ్యామిలీతో కలిసి రెస్టారెంట్‌కు వెళ్లినా ఎక్కువ మంది చికెన్ బిర్యానీనే ఆర్డర్ ఇస్తుంటారు. సామాన్యులకు అందుబాటు ధరల్లో ఉండటంతో హోటళ్లలోనే కాదు ఆన్‌లైన్ ఆర్డర్లలోనూ చికెన్ బిర్యానీ ముందుంది. తమకు వచ్చే ఫుడ్ ఆర్డర్లలో చికెన్ బిర్యానీ నంబర్‌వన్ స్థానంలో ఉందని ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ గతంలో వెల్లడించింది.



బకెట్ బిర్యానీ

రూ.కోట్లలో అమ్మకాలు

చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా అందరూ బిర్యానీ లాగించేస్తుండటంతో ఎక్కడికక్కడ బిర్యానీ సెంటర్లు వెలుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 4,500 వరకు బిర్యానీ సెంటర్లు, రెస్టారెంట్లు ఉండగా రోజుకు సుమారు రూ.4.5 కోట్లు నుంచి రూ.5 కోట్ల మేర బిర్యానీ అమ్మకాలు జరుగుతున్నట్టు అంచనా. బుధ, ఆదివారాల్లో అయితే అమ్మకాలు మరింత ఎక్కువగా ఉంటాయి. కొందరు ఔత్సాహిక యువకులు ఫుడ్ టూర్లు చేస్తూ ఆయా ప్రాంతాల్లో దొరికే బిర్యానీ వెరైటీల గురించి సోషల్ మీడియాలో వీడియోలు పెట్టి మరింత ప్రాచుర్యం కల్పిస్తున్నారు.



కుండ బిర్యానీ

రూ.20 నుంచి విక్రయాలు



30 ఏళ్ల క్రితం సీతయ్య పలావ్ సెంటర్ ప్రారంభించాను. మొదట్లో రూ. 20లతో బిర్యానీ ఇచ్చేవాళ్లం. ప్రస్తుతం రూ.150లకు చేరింది. యువతకు బిర్యానీ ప్యాషన్‌గా మారింది. బిర్యానీ తినడాన్ని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. బిర్యానీ తయారీలో నాణ్యత పాటించడం వలన అమ్మకాలు బాగుంటాయి.

– కె.సీతయ్య, సీతయ్య పలావ్ సెంటర్ యజమాని, భీమవరం

ఎక్కడెక్కడి నుంచో వస్తారు



మీల్స్ కంటే బిర్యానీ అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. బుధ, ఆదివారాల్లో మా వద్ద లభించే దూపుడు పోతు, నాటుకోడి దూపుడు బిర్యానీల కోసం విజయవాడ, రాజమహేంద్రవరం, ఇతర దూరప్రాంతాల నుంచి వస్తుంటారు. అలాగే ఇక్కడి నుంచి బంధువుల కోసం ప్రత్యేకంగా తీసుకువెళుతుంటారు.

– మంతెన కృష్ణంరాజు, వెంప రాజుగారి వంటిల్లు యజమాని, భీమవరం

ఇతర ప్రాంతాలకు వెళ్లి మరీ..



బిర్యానీ అంటే నాకెంతో ఇష్టం. ఏ ఊళ్లో ఏ బిర్యానీ ఫేమస్ అన్నది నాకు బాగా తెలుసు. వారానికి మూడు నుంచి నాలుగు సార్లు ఇతర ప్రాంతాలకు బిర్యానీ కోసం వెళ్లి మరీ తినడం నా అలవాటు. స్నేహితులంతా కలిసి సరదాగా ఫేమస్ బిర్యానీలు ఎక్కడ దొరుకుతాయో తెలుసుకుని అక్కడికి వెళుతుంటాం. పాట్ బిర్యానీ, మండీ బిర్యానీ ఇలా అన్నీ రుచి చూశాం.

– దాసి రత్నరాజు, తణుకు



వెజ్ బిర్యానీ

సంక్రమిత వ్యాధులపై అప్రమత్తం

కలెక్టర్ నాగరాణి

భీమవరం: పశువులు, జంతువులు, కీటకాల కారణంగా వ్యాధులు వచ్చే ప్రమాదముందని వాటిలో ప్రాణాపాయం కలిగించే వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. శనివారం సంక్రమిత వ్యాధుల నివారణ దినం (జూనోసిస్ డే) సందర్భంగా భీమవరం పశువుల ఆస్పత్రి వద్ద పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెంపుడు శునకాలకు ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించడం, పశుపోషకులు వాటి మలమూత్రాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ పెంపకంతో పాటు అప్రమత్తత అవసరమన్నారు. అనంతరం జిల్లా జంతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, పశుసంవర్ధశాఖ ఏడీ పి.సుధీర్‌బాబు పాల్గొన్నారు.



వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు

ఉపాధి మార్గాలతో మహిళల రాణింపు

భీమవరం(ప్రకాశం చౌక్): మహిళలు జీవనోపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ, మెప్మా అధికారులతో ఆమె సమీక్షించారు. లేస్ పార్క్ ఉత్పత్తులను సొసైటీల ద్వారా మార్కెటింగ్ సహాయం తీసుకుని రానున్న రెండు నెలల్లో బలోపేతం చేయాలన్నారు. జిల్లా సమాఖ్య సభ్యులు పాఠశాలలకు అవసరమైన హ్యాండ్ వాష్ తదితర వస్తువులను సొంతంగా తయారు చేసి అందించేందుకు ఆలోచన చేయాలన్నారు. ఫిషర్‌మెన్ కమ్యూనిటీకి చెందిన మహిళా సమాఖ్య సభ్యులు సోలా డ్రై ఫిష్ యూనిట్లు నెలకొల్పేందుకు సహాయాన్ని అందించాలని సూచించారు. మహిళా మార్ట్‌లో అమ్మకాలు పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని, మహిళా మార్కెట్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించి ఏర్పాటుకు సిద్ధం చేయాలన్నారు. అత్తిలి క్లస్టర్‌లోని మంచిలిలో పూతరేకుల తయారీలో మహిళలు కీలకంగా ఉన్నారని, త్వరలో తాను పరిశీలిస్తానన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎస్ఎస్ఎస్ వేణుగోపాల్, మెప్మా పీడీ గ్రంధి పార్వతి, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి

జేసీ ప్రవీణ్ ఆదిత్య



భీమవరం(ప్రకాశం చౌక్): బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు వర్తకులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో రిటైల్ అమ్మకందారులతో ఆయన సమావేశమై సరుకుల ధరల స్థిరీకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉల్లిపాయలు, కూరగాయలతో పాటు పప్పులు, బియ్యం, ఆయిల్ వంటి నిత్యావసర వస్తువుల ధరకు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. మార్కెటింగ్, సివిల్ సప్లయ్ శాఖ, రైస్, పప్పులు, ఆయిల్, కూరగాయలు, రిటైల్ వ్యాపారస్తులకు ఉల్లి, టమాటా ధరల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు ఇచ్చారు. రానున్న కాలంలో ధరలు మరింత పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్తకులంతా వారి వద్ద ఉన్న సరుకుల నిల్వలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాకు దిగుమతయ్యే కూరగాయలు ఎక్కువగా ఏ ప్రాంతాల నుంచి వస్తాయని వ్యాపారస్తులను ఆరా తీశారు. ఇతర ప్రాంతాల్లో ఎక్కువగా పండించే కూరగాయలను నేరుగా కొనుగోలు చేసి రైతు బజార్‌ల ద్వారా విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ మార్కెటింగ్ సునీల్, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరాం ప్రసాద్, ఏఎస్‌ఓ ఎం.రవిశంకర్, వర్తక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతు సేవలో కేవీకేలు కీలకం

తాడేపల్లిగూడెం: రైతు సేవలో కేవీకేలు పనిచేస్తున్నాయని, వారి పురోభివృద్ధిలో క్రియాశీలక భూమిక పోషిస్తున్నాయని వెంకట్రామన్నగూడెం కేవీకేలో శనివారం స్వర్ణోత్సవ ముగింపు కార్యక్రమంలో వక్తలు అన్నారు. కేవీకేలో రెండు రోజులపాటు జరిగిన స్వర్ణోత్సవాల ముగింపు వేడుకలకు ఎన్ఏఆర్ఎం హైద్రాబాద్ నుంచి ఎస్.సెంథిల్ వినాయగం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేంద్రియ వ్యవసాయంలో జీవన ఎరువుల పాత్ర, యువతకు వ్యవసాయ, అనుబంధ రంగాలలో ఉపాధి అవకాశాలు గురించి వివరించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ సలోమి సునీత మాట్లాడుతూయువ త కేవీకే నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సేంద్రియ పద్ధతులు, పశువుల్లో పోషక యాజమాన్యం, కోళ్ల పెంపకంపై శాస్త్రవేత్తలు వి.దీపి, దేవీ వరప్రసాదరెడ్డి, వరిలో తెగుళ్ల యాజమాన్యంపై ఎన్.చిరంజీవి వివరించారు. ప్రధాన శాస్త్రవేత్త ఈ.కరుణశ్రీ అధ్యక్షత వహించగా శాస్త్రవేత్తలు ఎం.రాఘవేంద్రరెడ్డి, కె.వెంకటసతీష్ , గణపవరం, తాడేపల్లిగూడెం, మంచువారి గూడెం, తూర్పురేకుల గుంట, తణుకు, నల్లజర్ల , ప్రకాశరావుపాలెం, తెలికిచర్ల తదితర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న అధికారులు

ఇసుక పాలసీ అమలుకు చర్యలు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో ఉచిత ఇసుక పాలసీ అమలుకు ముందస్తు చర్యలు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ సి.నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆమె అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఆరు ఓపెన్ రీచ్‌లు ఉన్నాయని, ఆచంట మండలంలో కరుగోరుమిల్లి, కోడేరు, పెనుగొండ మండలంలో సిద్ధాంతం-1, 2, నడిపూడి-1, 2 రీచ్‌లు, అబ్బిరాజుపాలెం, మాధవాయపాలెం, యలమంచిలి లంక, దొడ్డిపట్ల, చించినాడలో డీసిల్టేషన్ పాయింట్లు ఉన్నాయన్నారు. అలాగే భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు, సిద్ధాంతం, కొడమంచిలిలో ఇసుక స్టాక్ యార్డులు ఉన్నాయన్నారు. ఇసుక తవ్వకాల అనుమతులకు ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉందన్నారు. డీసిల్టేషన్ పాయింట్లకు గోదావరి హెడ్‌వర్క్స్ ఈఈ కాశీ విశ్వేశ్వరరావును కస్టోడియన్ అధికారిగా నియమించామన్నారు. స్టాక్ పాయింట్లకు కస్టోడియన్ అధికారులను నియమించాలని ఆదేశించారు.

శునకాల షోయగం







ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని ఏలూరు ప్రభుత్వ పశువుల ఆస్పత్రికి పలు జాతుల పెంపుడు శునకాలను వాటి యజమానులు తీసుకువచ్చారు. అక్కడ శునకాలకు టీకాలు వేయించారు. ఈ సందర్భంగా కొందరు శునకాలను ఎత్తుకుని రావడం, కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో తీసుకురావడం ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు







క్లుప్తంగా

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న ఏ ఐడియా సీఈఓ ఎస్.సెంథిల్ వినాయగం

తాడేపల్లిగూడెం: సాంకేతికతను ఒడిసిపట్టుకోవడం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉండాల్సిన ప్రథమ లక్షణమని ఏ ఐడియా సీఈఓ డాక్టర్ ఎస్.సెంథిల్ వినాయగం చెప్పారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలో శనివారం కేరీర్ డెవలప్‌మెంటు సెంటర్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ కింద స్కిల్ ఫర్ ఎక్సలెన్సు అండ్ ఇన్నోవేషన్ సెమినార్‌ను నిర్వహించారు. రీసోర్సుపర్సన్‌గా సెంథిల్ పలు విషయాలను వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు, సెన్సార్ టెక్నాలజీ వాడకం వంటివి ఎంటర్‌ప్రెన్యూర్స్‌ను పోటీప్రపంచంలో నిలబెడతాయన్నారు. విత్తనాభివృద్ధి, కట్ ఫ్లవర్స్, అపికల్చర్, వర్మికంపోస్టు వంటి అవకాశాలు, వాటిని సుగమం చేసుకొనే మార్గాల గురించి వివరించారు. డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఏఎస్.పద్మావతమ్మ, డీఎస్ఏ సలోమి, విస్తరణ సంచాలకుడు ఇ.కరుణశ్రీ, కళాశాల అసోసియేట్ డీన్ ఎం.మాధవి తదితరులు పాల్గొన్నారు.

తణుకు వైనాట్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న వైనాట్ అధినేత వెంకటరాయుడు

తణుకు: హోం అప్లయన్సెస్ అమ్మకాల్లో తణుకు వైనాట్ 2023–24 సంవత్సరంలో మరో మైలురాయి అధిగమించింది. ఈ మేరకు శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రతిష్టాత్మకమైన ఎల్‌జీ లీగ్ ఆఫ్ టైటాన్స్ అవార్డును ఎల్‌జీ ఎండీ హాంగ్‌జు జియోన్ చేతుల మీదుగా వైనాట్ అధినేత జుజ్జువరపు వెంకటరాయుడు అందుకున్నారు. వినియోగదారులకు వైనాట్ సంస్థపై ఉన్న అపారమైన నమ్మకమే ఈ విజయానికి కారణమని వెంకటరాయుడు అన్నారు.

గోవిందుడి చెంత గోసంరక్షణ

హిందూ ధర్మంలో గోమాతను భగవత్ స్వరూపంగా, కామధేనువుగా భావిస్తారు. సకల దేవతలు యిమిడి ఉన్న ఆవు నుంచి ఉత్పత్తి అయ్యే పదార్థాలు సైతం అటు శాస్త్రీయంగా, ఇటు వైద్య పరంగా ఎంతో మేలు కలిగిస్తాయి. చివరకు గో మూత్రం, పేడ కూడా శాస్త్రీయంగా విలువైనవి.గో పోషణ భారమైన ప్రస్తుత తరుణంలో గో సంరక్షణకు ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం పెద్దపీట వేసింది. దేశీయ జాతి ఆవుల పోషణ, వాటి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.

- గోశాలలో 9 రకాల దేశీయ జాతి ఆవుల పెంపకం
- ప్రకృతి వ్యవసాయం కోసం రైతులకు దత్తత ఇస్తున్న దేవస్థానం

ద్వారకాతిరుమల : శ్రీవారి దేవస్థానం కొండపైన సువిశాల ప్రదేశంలో గో సంరక్షణ శాలలు నిర్మించి, అందులో పశు పోషణ చేస్తున్నారు. భక్తులు నుంచి సేకరిస్తున్న విరాళాలతో గోసంరక్షణశాలను మరింత అభివృద్ధి చేస్తున్నారు. ఇంత వరకు భక్తులు అందించిన విరాళాలు రూ.4 కోట్లు డిపాజిట్లు బ్యాంకులో ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు గోవులను దత్తత ఇస్తున్నారు. గో పోషణను రాజభోగము అన్నట్లుగా ఉంది. దాదాపు 34 మంది సిబ్బంది వాటి బాగోగులు చూస్తున్నారు. షవర్ల కింద స్నానం, ఒక్కో ఆవుకు ఒక్కో పేరు, సమయానికి గడ్డి, దాణా అందించడం, వాకింగ్ చేయించడం, తరచు పశువైద్యులచే వైద్య పరీక్షలు చేయించడం వంటివి చేస్తున్నారు. ప్రస్తుతం గోసంరక్షణశాలలో 409 ఆవులు ఉన్నాయి. అవి నిత్యం 150 వరకు



గో సంరక్షణశాలలోని గోవులు

పాలను ఇస్తున్నాయి. 10 లీటర్ల పాలను దేవతా మూర్తుల అభిషేకాలకు, 30 లీటర్ల పాలను ప్రసాదాల తయారీకి, మిగిలిన పాలను నిత్యాన్నదానంలో వినియోగిస్తున్నారు.

ఒంగోలు జాతి

హంస వర్ణం కలిగిన తెలుపు రంగుతో, భారీకాయంతో, సొగసైన అంగసౌష్టవంతో, బలిష్టమైన మెడతో యజమాని పట్ల విశ్వాసంతో, వ్యవహరించే ఈ ఒంగోలు జాతికి సరిజోడైన జాతి వేరొకటి లేదు. పాలేరు, గుండ్లకమ్మ నదుల పరివాహక ప్రాంతాల్లో ఈ జాతి బాగా అభివృద్ధి చెందింది. సగటున రోజుకు ఈ జాతి ఆవులు 6 లీటర్ల వరకు పాలిస్తాయి.



– ఒంగోలు జాతి ఆవు

గిర్ జాతి

గుజరాత్‌లోని గిర్ పర్వత ప్రాంతానికి చెందినది. ఈ జాతి రాజస్థాన్ రాష్ట్రంలోనూ ఉంటాయి. 45 నుంచి 50 డిగ్రీల ఉష్ణోగ్రతను తట్టుకుంటాయి. ఎరుపు శరీర రంగును కలిగి ఉంటాయి. బ్రెజిల్‌లో జరిగిన ప్రపంచ దేశీయ గోజాతి పాల పోటీల్లో 48 లీటర్ల పాల దిగుబడినిచ్చి ప్రథమ స్థానాన్ని పొందింది.



గిర్ జాతి ఆవు

దేశవాళి (నాటు) జాతి

ప్రకృతి వ్యవసాయంలో కీలకమైనది ఈ దేశవాళి ఆవు. ఈ జాతి ఆవు రోజుకు నికరంగా 10 కేజీల పేడను ఇస్తుంది. జీవామృతం తయారీకి ఉపయోగపడుతుంది. వారానికి ఒకసారి నాటు ఆవుపాలు తాగినా, జున్ను వండుకుని తిన్నా ఆరోగ్యానికి ఎంతో మేలు



– దేశవాళి(నాటు) జాతి ఆవు

పుంగనూరు జాతి

బూడిద రంగు వర్ణం కలిగి ఉంటాయి. ఎరుపు, సింధూరం, నలుపు వర్ణాలు సహజం. మగ పశువులు మెతక స్వభావం కలవి. చిన్న శరీరం వల్ల ఈ జాతి పశువులు కొండలు, గుట్టలు, వాలు ప్రాంతాల్లో సులభంగా సంచరిస్తాయి. 35 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతను తట్టుకుంటాయి. రోజుకు సగటున 3 నుంచి 3.5 లీటర్ల పాలిస్తాయి



– పుంగనూరు జాతి ఆవు

కాంక్రేజ్ జాతి

భారతదేశపు పురాతన గోజాతులలో కాంక్రేజు ఒకటి. 43 నుంచి 48 డిగ్రీల ఉష్ణోగ్రతను తట్టుకోగలవు. ఎద్దుల్లో మూపురం పెద్దదిగా, కొద్దిగా వాలి ఉంటుంది. చెవులు పెద్దవిగా లోలాకృతిలో ఉంటాయి.



– కాంక్రేజ్ జాతి ఆవు

కపిల జాతి


నలుపు, తేనె రంగు వర్ణం కలిగిన ఈ జాతి ఆవులు ఎంతో ఖరీదైనవి. వీటి మూత్రం, పాలను ఆయుర్వేద వైద్యంలో వినియోగిస్తారు. అలాగే శివదేవుని అభిషేకానికి వాడతారు. కపిల గోవు చుట్టూ ప్రదక్షిణలు చేస్తే ఎంతో మంచిదని పండితులు చెబుతారు.



– కపిల జాతి ఆవు

నీమారి జాతి

ఈ జాతి ఆవులు నలుపు, తెలుపు వర్ణం కలిగి ఉంటాయి. ఇవి అధిక ఉష్ణోగ్రతను తట్టుకోగలవు. మంచి పాల దిగుబడిని ఇస్తాయి. సమానమైన కొమ్ములు, మూపురం కలిగి ఉంటాయి.



– నీమారి జాతి ఆవు

సాహివాల్

ఈ జాతి పంజాబ్, గుజరాత్ రాష్ట్రల్లోని పాకిస్థాన్ సరిహద్దుల్లో విస్తరించింది. 45 నుంచి 50 డిగ్రీల ఉష్ణోగ్రతను తట్టుకోగలవు. ఆవులలో తల, బలిష్టత మధ్యస్తంగా ఉంటాయి.



– సాహివాల్ జాతి ఆవు

మైసూర్ జాతి

కర్ణాటకలో ఎక్కువగా ఉన్న ఈ జాతి ఆవులకు మంచి గిరాకీ ఉంది. ఈ జాతి ఆవు పాలల్లో ఏ2 ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది. చివర సూదిగా ఉండే పొడవాటి కొమ్ములు, నలుపు, తెలుపు వర్ణంలో ఇవి ఉంటాయి.



– మైసూర్ జాతి ఆవు

కేవీకేలు రైతులకు వరం

ఉండి: కేవీకేలు రైతులకు వరమని ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు పేర్కొన్నారు. కేవీకేలు ఏర్పాటై 50 ఏళ్ళు గడుస్తున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం కేవీకే స్వర్ణోత్సవ జ్యోతి కేవీకేకు చేరుకుంటుందని తెలిపారు. కేవీకేల ద్వారా దేశంలోని రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ నెల 8న కేవీకేలో వరి విత్తనోత్పత్తి చేస్తున్న రైతులకు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9న మత్స్యపురిలో వరి, మత్స్య రైతులకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వానాకాలంలో పశువుల ఆరోగ్యం జాగ్రత్త !



తాడేపల్లిగూడెం: వానాకాలం వచ్చిందంటే పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి. వ్యాధులు సోకకుండా చూసుకోవడంతో పాటు, సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. యాజమాన్య పద్ధతుల గురించి వెంకట్రామన్నగూడెం గేదెల పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.ఆనందరావు వివరించారు.

యాజమాన్య పద్ధతులు ఇలా

వానాకాలంలో సూర్యకాంతి, వేడి తక్కువగా ఉండి, గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో పశు సంతతి వృద్ధి, పశువుల పోషణ, పశువుల ఏరివేత, గృహవసతి ఆరోగ్య సంరక్షణ అనే విషయాలపై దృష్టి పెట్టాలి.

ఎద సమయాన్ని గుర్తించాలి

వానాకాలంలో చల్లగా ఉండటం వల్ల ఆడ పశువులు ఎదకు వస్తాయి. ఈ ఎద వేకువ జామున కాని, సాయంత్రం సమయంలో కాని వస్తుంది. గేదెల్లో వానాకాలం చివరి నెలల నుంచి శీతల గాలులు ప్రారంభం అవ్వగానే ఎద లక్షణాలు కనిపిస్తాయి. ఎద లక్షణాలు ఆవులలో ఉదయం కనిపిస్తే, సాయంత్రం చూలు కట్టించాలి. సాయంత్రం కనిపిస్తే ఉదయం చూలు కట్టించాలి. 24 గంటల ఎద కాలంలో మధ్యస్త దశ సగం నుంచి చివరిలో చూలు కట్టిస్తే చూలు నిలబడుతుంది. ఈ దశలో వచ్చే మ్యూకస్ ద్రవం పారదర్శకంగా తీగలా ఉంటుంది. గేదెలలో ఎద కాలం 36 గంటలు ఉంటుంది. గేదెలలో ఉదయం ఎద కనిపిస్తే మరుసటిరోజు ఉదయం, సాయంత్రం ఎద కనిపిస్తే మరుసటి రోజు సాయంత్రం చూలు కట్టించాలి. గేదెలలో మూగ ఎద ఎక్కువగా ఉంటుంది. అంటు ఎదకాలంలో ఎలాంటి లక్షణాలు చూపించవు. పశువుల్లో ఎద లక్షణాలు కనిపించే సమయంలో రైతులు జాగ్రత్తగా చూసుకోవాలి. పాడిపరిశ్రమ నిర్వహించే పశుపోషకులు మందలో ఒక టీజర్ ఆబోతును ఉంచుకోవాలి. రోజు ఉదయం, సాయంత్రం మందలో విడిచిపెట్టాలి. ఆబోతు గేదెలతో కలిసిన సమయంలో గేదెల్లో ఎదను గుర్తిస్తూ ఉండాలి. చూలు కట్టించిన తర్వాత మళ్లీ ఎద వచ్చే వరకు అంటే సుమారుగా 20–21 రోజుల తర్వాత పరిశీలించి ఎద లక్షణాలు కన్పించకపోతే తదుపరి ఎదకాలం వరకు వేచిచూడాలి. చూలు కట్టించిన మూడో నెలలో గర్భదారణ పరీక్ష చేసి చూలు నిర్ధారించుకున్న తర్వాత చూడి పశువును సక్రమంగా పోషించాలి.

పాడి - పంట

పోషణ

పచ్చిక బయల్లో పెరిగిన గడ్డిన తిన్న పశువులకు తగినంత వేడి అందదు. ఎండుగడ్డి కూడా సుమారు ఐదారు కిలోలు రోజూ మేతగా ఇవ్వాలి. నాణ్యమైన దాణాని మేతగా పెట్టాలి. శుభ్రమైన నీరు 60 నుంచి 70 లీటర్లు, వట్టిపోయిన పశువులకు 40 లీటర్లు ఇవ్వాలి.

ఏరివేత


వర్షాకాలం అంటువ్యాధులు ప్రబలే సమయం. ముసలి పశువులను దీర్ఘకాలం వ్యాధులతో బాధపడే పశువులను వేసవికాలానికే కంటే ముందు మందనుంచి దూరంగా ఉంచాలి. ఉత్పత్తి సామర్థ్యం తక్కువగా ఉన్న పశువులను మందనుంచి తీసివేయాలి.

ఆరోగ్య సంరక్షణ

పశువుల కొట్టాల పైకప్పులో రంధ్రాలు లేదా చీలికలు ఉన్నా, వర్షం నీరు కొట్టాల్లోకి చేరుతుంది. దీని వల్ల మేత తడిచి పశువులకు అసౌకర్యం కలుగుతుంది. పశువుల కొట్టాల్లో తేమ పెరిగి అమ్మోనియా శాతం పెరుగుతుంది. ఈ వాయువు ఈగలు, దోమలు, గొమర్లు, పిరుదులను ఆకర్షిస్తాయి. ఇవి పశువులకు ప్రమాదకరం.

వేసవి చివరిలో డీవార్మింగ్ చేయించాలి. తొలకరి వానలకు ముందు జబ్బవాపు, గొంతువాపు, గాలికుంటువ్యాధి, టీకాలు వేయించాలి. వానాకాలంలో చనిపోయిన పశువులను 6–7 అడుగుల లోతు గోతిలో ఉప్పు, సున్నం వేసి పూడ్చాలి. షెడ్‌లో దోమలు, ఈగల నివారణ మందులు పిచికారీ చేయాలి. పశువులను ఒత్తిడికి గురి చేయకూడదు.

పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి



వానాకాలంలో పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి. జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, వైద్యుల సలహాలు పాటించాలి. వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలి. పశువులు ఎదకు వచ్చే సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

–డాక్టర్ కె.ఆనందరావు, గేదెల పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త , వెంకట్రామన్నగూడెం

రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిపై దాడి

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేట ప్రాంతంలో రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, ఏలూరు మండలం డిప్యూటీ తహసీల్దార్ లామ్ విద్యాసాగర్‌పై దుండగుడు కత్తితో దాడి చేశాడు. శనివారం ఉదయం 10.30 గంటలకు ఇంటి నుంచి కార్యాలయానికి బైక్‌పై వెళ్తుండగా అగంతకుడు ఇన్నోవా కారులో అడ్డగించి దాడి చేసినట్లు చెబుతున్నారు. ఆయన ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఏలూరు పోలీసులు, బాధితుడు



ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న లామ్ విద్యాసాగర్

తెలిపిన వివరాల ప్రకారం.. బైక్ ఆపగానే కారులో నుంచి దిగిన సునీల్‌కుమార్ అనే వ్యక్తి సాగర్‌తో గొడవకు దిగాడు. అమీనాపేట సెయింట్ పాల్స్ లూథరన్ చర్చికి సంబంధించిన వ్యవహారాల్లో వీరి మధ్య విభేదాలు ఉన్నట్లు చెబుతున్నారు. సునీల్‌కుమార్ కత్తితో దాడి చేయగా విద్యాసాగర్ చేతికి గాయమైంది. అమీనాపేట లూథరన్ చర్చిలో విద్యాసాగర్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. కొన్నేళ్లుగా సునీల్‌కుమార్ సైతం కమిటీ సభ్యుడిగా పనిచేస్తుండగా ఇద్దరి మధ్య పలు అంశాల్లో గొడవలున్నాయని సాగర్ చెబుతున్నారు.

ట్రాక్టర్ తిరగబడి యువకుడి మృతి

కొయ్యలగూడెం: ట్రాక్టర్ తిరగబడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బిల్లిమిల్లిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వీఆర్వో మధు తెలిపిన వివరాల ప్రకారం అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం పంగిడి గ్రామానికి చెందిన లాలం ప్రసాద్(17) ప్రమాదంలో మృతి చెందాడు. ప్రసాద్ తండ్రి సత్తిబాబు తల్లిదండ్రులతో కలిసి జామాయిల్ చెట్లు నరికివేత మకాం పనికి వచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కలపలోడు చేసి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ ట్రక్కుతో సహా ప్రమాదానికి గురైంది. మృతుడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే చెందాడని పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఏజెన్సీలో పొంగి పొర్లుతున్న వాగులు



కాకులవారిగూడెం సమీపంలో జల్లేరు వాగు దాటుతున్న కూలీలు

బుట్టాయగూడెం: గత రెండురోజులుగా ఏజెన్సీలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ తీవ్రమైన ఎండ, ఉక్కపోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అయితే సాయంత్రం భారీగా వర్షాలు పడుతున్నాయి. దీంతో ఏజెన్సీలోని పలు కొండ కాలువలు పొంగిపొర్లాయి. జల్లేరు జలాశయంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. మెట్టగూడెం, కాకులవారిగూడెం సమీపంలోని కొండ కాల్వ పొంగింది.

యువతి మృతదేహం కోసం గాలింపు



ఝాన్సీ మృతదేహం కోసం గాలిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఏలూరు కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన యువతి మృతదేహం కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెచ్చేటి ఝాన్సీ (20) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో ఒంటరిగా ఉంటోంది. జీవితంపై విరక్తితో ఈ నెల 2న నారాయణపురం బ్రిడ్జి నుంచి ఏలూరు కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న చేబ్రోలు పోలీసులు ఫైర్‌సిబ్బంది సాయంతో గాలింపు నిర్వహించగా, ఫలితం లేకుండా పోయింది. అయినప్పటికీ పోలీసులు గాలింపును కొనసాగించారు. శనివారం మరోసారి బోటు ఏర్పాటు చేసి రాజమండ్రి, తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల గజ ఈతగాళ్లతో ఏలూరు కాలువలో గాలింపు చేపట్టారు. ఆచూకీ లభించలేదు. చేబ్రోలు ఎస్సై మాట్లాడుతూ యువతి మృతదేహం లభించే వరకు గాలింపు చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

చెస్ ఆర్బిటార్ నార్మ్ సాధించిన కిషోర్



భీమవరం: జిల్లాకు చెందిన మాదాసు కిషోర్ చెస్ ఇంటర్నేషనల్ ఆర్బిటార్ నార్మ్ సాధించాడు. ఇటీవల భీమవరంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫెడ్ రేటింగ్ క్లాసికల్ టోర్నమెంట్‌లో ఆర్బిటార్‌గా వ్యవహరించిన కిషోర్ మొదటి ఇంటర్నేషనల్ ఆర్బిటార్ నార్మ్ సాధించారు. ఈ టోర్నమెంట్‌లో 3 దేశాల నుంచి 272 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

బంగారం షాపులో చోరీ

ఆకివీడు : స్థానిక బంగారం షాపులో దోపిడీ జరిగింది. ఆభరణాలు కొనుగోలు చేసేందుకు షాపులోకి వచ్చిన ఇద్దరు మహిళలు నగల్ని చూస్తూ.. నకిలీ నగల్ని బంగారు నగల స్థానంలో ఉంచి వెళ్లిపోయారు. కొద్ది సేపటికి యజమానికి అనుమానం వచ్చి నగల్ని పరిశీలించగా అవి నకిలీవని తెలిసింది. దీంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. నగల విలువ సుమారు రూ. 2.40 లక్షలుంటాయని యజమాని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ నాగబాబు చెప్పారు. సీసీ పుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాద స్థలంలోనే మృతి చెందిన రేవు ఏసు

నరసాపురం రూరల్ : మొగల్తూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తోట సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతరేవు బ్రిడ్జి దిగువన ఎదురుగా వస్తున్న బైకును మహీంద్రా బొలేరో వ్యాన్ ఢీ కొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న భీమవరం మండలం దొంగపిండికి చెందిన రేవు ఏసు(20) అక్కడికక్కడే మృతి చెందగా అదే బైక్‌పై ఉన్న బాలుడు తిరుమాని గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ బాలుడిని 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.వెంకటరమణ తెలిపారు.

బంగారం చోరీకి యత్నం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక మెయిన్‌రోడ్డు జ్యూయలరీ షాపుల సెంటర్ వద్ద ఓ యువతి బంగారం చోరీ చేసి పారిపోతుండగా పట్టుబడింది. బంగారం కొనుగోలు చేయడానికి స్థానికంగా ఉన్న ఓ నగల షాపులోకి వెళ్లిన యువతి ఆభరణాలు చూపిస్తుండగా అందులో ఒక వస్తువు తీసుకుని పరుగు తీయబోయింది. వెంటనే షాపులో పనిచేస్తున్న మహిళ ఆమెను పట్టుకుంది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

మానవత సంస్థ ఆర్థిక సాయం



గణేశుల కళ్యాణ్‌కు మానవత సాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్రగాయమైన స్థానిక వానపల్లిగూడెంకు చెందిన గణేశుల కళ్యాణ్‌కు మానవత సంస్థ శనివారం రూ.10 వేల చెక్కును అందజేసింది. సంస్థ ఉపాధ్యక్షుడు దువ్వ శ్రీనివాస్ రూ.5 వేలు నగదు ఇచ్చారు. సంస్థ అధ్యక్షుడు పత్స వెంకటేశ్వరరావు, సెక్రటరీ ఆంజనేయులు, కోశాధికారి యెగ్గిన శరత్, చేకూరి బంగార్రాజు, తుమరాడ చిన్న, మానవత సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహనతో మెలగాలి

తణుకు టౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చిన్న వయస్సులోనే వివాహాలు చేసుకోవడం వలన అనేక ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదముందని, దీనిపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థినులకు అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కేవీవీఎస్ కృష్ణ కుమారి చెప్పారు. శనివారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరులోని నెంబరు 2 మండల పరిషత్ పాఠశాలలో కిశోర బాలికలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల కారణంగా భవిష్యత్‌లో జరిగే అనర్థాలను విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం పీ ఉషారాణి, నెంబరు 2 హెచ్‌ఎం మల్లపరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియా వ్యాధి నిర్మూలనకు సహకరించాలి



అత్తిలిలో డ్వాక్రా సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు నాగరాజు

అత్తిలి: డయేరియా వ్యాధి నిర్మూలనకు డ్వాక్రా సంఘాల ప్రతినిధులు సహకరించాలని అత్తిలి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ కె నాగరాజు కోరారు. అత్తిలిలో శనివారం మండల డ్వాక్రా సమాఖ్య భవనంలో డయేరియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు డయేరియా వస్తే వెంటనే ఆరోగ్యకేంద్రానికి తీసుకురావాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ సిరప్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని కోరారు. కార్యక్రమంలో మంచిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్, ఏపీఎం ఎం రత్నకుమార్‌బాబు, సీసీ కె సునీతా, కె శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు



అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల శ్రీవేంకటేశ్వరస్వామి వారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున శ్రీస్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం స్వామివారికి అర్చనలు చేసి విశేషంగా అలంకరించారు. అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలను జరిపారు. పరిసర గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మంగరాజుకు అవార్డు



మంగరాజుకు అవార్డు అందిస్తున్న నాగబుజ్జి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజుకు ఆదర్శ్ అవార్డును స్థానిక ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ నిర్వాహకుడు రొక్కాల నాగబుజ్జి ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డిమాండ్స్ డేను విజయవంతం చేయాలి

భీమవరం: తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఈ నెల 10వ తేదీన నిర్వహించే డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను మార్చి యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు.

ముమ్మరంగా సార్వా వరినాట్లు

- కూలీలకు పెరిగిన డిమాండ్
- మండలంలో సుమారు 11 వేల ఎకరాల్లో వరిసాగు



తేతలిలో వరి నాట్లు వేస్తున్న బెంగాళీ కూలీలు

తణుకు టౌన్: తణుకు మండలంలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు ఆశాజనకంగా కురవడంతో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మే నెలలోనే వర్షాలు కురవడంతో జూన్ నెల ప్రారంభంలోనే వరి నారు మడులను సిద్ధం చేసుకున్న రైతులు జూన్ నెలాఖరు నుంచే వరినాట్లు ప్రారంభించినా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు ఒక్కసారిగా వరినాట్లు ప్రారంభించారు. దీనితో వరినాట్లు వేసేందుకు బెంగాళీ కూలీలకు డిమాండ్ పెరిగింది. తణుకు మండలంలో వ్యవసాయ భూములు పల్లం, మెరక కలిసివుండటంతో మెరక పొలాల్లో బెంగాళీ కూలీలు, పల్లపు పొలాల్లో మన ప్రాంత కూలీలతో నాట్లు వేయిస్తారు. వరినాట్లు వేసే విషయంలో మన ప్రాంత కూలీలకు, బెంగాళీ కూలీలకు వ్యత్యాసం వుంటుందని రైతులు పేర్కొంటున్నారు. బెంగాళీ కూలీలు వేసే వరి నాట్లకు ఎకరానికి 10 కిలోల విత్తనాలకు సంబంధించిన వరి నారు సరిపోతుందని, అదే మన ప్రాంత కూలీలు వేసే నాట్లకు 20 కిలోల విత్తనాలకు సంబంధించిన వరి నారు అవసరమవుతుంది. దీనితో పల్లపు భూముల్లో ఎక్కువ నాట్లు వేయడం వలన ముంపు సమయంలో కొన్ని నాట్లు పోయినా కొన్ని నాట్లు మిగులుతాయనే ఉద్దేశంతో మన ప్రాంత కూలీలతోనే వరి నాట్లు వేయిస్తున్నారు. బెంగాళీ కూలీల నాట్ల వలన వరి పంట పెరిగే కొద్దీ ఎరువులు ఎక్కువగా అవసరమవుతాయని రైతులు పేర్కొంటున్నారు. బెంగాళీ కూలీలు వేసే నాట్లు చాలా తక్కువగా వుండటం, ఒక్కో నాటుకు ఒకటి, రెండు మాత్రమే ఉండటంతో నాట్లు దుబ్బులు చేసేందుకు ఎక్కువగా ఎరువులు వేయవలసి వుంటుందని పేర్కొంటున్నారు. ఒక ఎకరానికి మన ప్రాంత కూలీలు 8 మంది పనిచేస్తారని, దీనికి రూ. 4 వేలు ఖర్చు అవుతుందని అంటున్నారు. అదే బెంగాళీ కూలీలు రూ. 4 వేలకు నలుగురు వ్యక్తులు పని చేస్తారని పేర్కొంటున్నారు. మండలంలో ఎక్కువగా స్వర్ణ, 1318 రకాల వరిని సాగు చేస్తున్నారు. సుమారు 11 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పల్లపు పొలాల్లో మన కూలీల నాట్లే బెటర్



ఖరీఫ్‌లో వరి పంటకు ఎక్కువగా భారీ వర్షాల కారణంగా ముంపు భయం ఉంటుంది. మన ప్రాంత కూలీలు నాట్లు వేసేటప్పుడు ఎక్కువ వేస్తుంటారు. దీంతో కొన్ని నాట్లు వర్షాల కారణంగా కొట్టుకుపోయినా మిగిలిన మొక్కలతో పంట పండుతుంది. అదే బెంగాళీ కూలీల తక్కువ నాట్లు వేయడం వలన గ్యారెంటీ ఉండదు. వారి నాట్లు పల్లపు పొలాలకు అంత అనుకూలంగా వుండవు.

–నడింపల్లి శ్రీనివాసరాజు, రైతు తేతలి.

ఎరువులు ఎక్కువ అవసరం



బెంగాళీలు నాటే వరి నాట్ల వలన పంటకు ఎరువులు, పురుగుమందులు ఎక్కువగా అవసరమవుతాయి. దీని వలన పెట్టుబడి ఖర్చులు ఎక్కువగా పెరుగుతాయి. బెంగాళీల వరి నాట్లు మెరక పొలాలకే అనుకూలంగా వుంటాయి.

–ఇందుకూరి రామరాజు, రైతు దువ్వ.

నేటి నుంచి జగన్నాథస్వామి ఉత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక 26వ వార్డు జూబ్లీ రోడ్డులో వేంచేసియున్న శ్రీ జగన్నాథ, సుభద్ర నిలయంలో ఆదివారం ఆషాడ శుద్ధ విదియ నుంచి ఈ నెల 17వ తేదీ బుధవారం వరకు శ్రీ జగన్నాథస్వామి ఆలయ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎస్ విశ్వమోహన్‌రావు తెలిపారు. స్వామివారికి ప్రతిరోజూ అష్టోత్తర, సహస్రనామార్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామని, భక్తులు స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

భోజనశాల ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చినతాడేపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అత్తంటి విశ్వచందు – గాయత్రి దంపతుల ఆర్థిక సాయంతో నిర్మించిన భోజనశాలను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ఇతోధికంగా సహకరించాలని కోరారు. సర్పంచ్ పిచ్చికల రాజారావు, దండగర్ర సర్పంచ్ పిల్లా రాంబాబు, పంచాయతీ కార్యదర్శి బిరుదుకోట రమేష్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జీ, నాయకులు పరిమి రవికుమార్, ముత్యాల సత్యనారాయణ, మద్దిపాటి సత్యనారాయణ, పద్మనాభుని మురళీ, ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



తణుకు: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరు విద్యావంతులు కావాలని, బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక యాగర్లపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన జగజ్జీవన్ రామ్ విగ్రహాన్ని శ్రీనివాస్ శనివారం ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, నరిస్సే సోమేశ్వరరావు, వర్తనపల్లి కాశీ, చాపల రమేష్, రావాడ దుర్గారావు, వై.రమేష్, వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

పట్టణ షామియానా ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు చెప్పారు. అసోసియేషన్ నాయకులు శిరంగుల నరసింహమూర్తి, కాళ్ల రవి, యాపాడ ప్రకాష్, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, నమ్మి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దళితులకు ఓటు హక్కు జగ్జీవన్‌రామ్ ఘనతే

పెంటపాడు: దేశంలో దళితులకు మొట్టమొదటిసారిగా ఓటుహక్కు కల్పించిన ఘనత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్‌కే దక్కుతుందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం బిళ్లగుంట గ్రామంలో ఆయన విగ్రహానికి లక్ష్మణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పెంటపాడు : బిల్లగుంటలో నివాళులర్పిస్తున్న లక్ష్మణరావు



తాడేపల్లిగూడెం (టీఓసీ): జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

తణుకు: భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం తణుకు మండలంలో ఘనంగా నిర్వహించారు. వీరభద్రపురం గ్రామ సెంటర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువుల్లో గర్భకోశ వ్యాధులకు ఉచిత వైద్యం



కోనాలలో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ జేసురత్నం

తణుకు టౌన్: పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణకు రైతులకు ప్రభుత్వం సహాయం అందజేస్తున్నట్లు పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ జీ జేసురత్నం చెప్పారు. శనివారం తణుకు రూరల్ మండలం కోనాల గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన పశువుల గర్భకోశ వ్యాధుల నివారణకు సంబంధించి ఉచిత వైద్య శిబిరంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆవులు, గేదెలు, మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందు, గోమార్లు నివారణ మందులు, గర్భకోశ వ్యాధుల నివారణకు సంబంధించి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీటీసీ ఎం సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ మల్లిపూడి చిన్నయ్య, మాజీ సర్పంచ్ బూరుగుపల్లి ఆనంద రమేష్, మండల పశువైద్యాధికారి డాక్టర్ కే శంకర భావన్నారాయణ, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు అర్బన్: పారిశుధ్య నిర్వహణపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణను శనివారం ఆయన పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వర్షాకాలం వచ్చే ముందే డ్రెయినేజీల్లో పూడిక తొలగించే బాధ్యత తీసుకోకపోవడం కారణంగానే డ్రెయినేజీల్లో మురుగునీరు ప్రవాహానికి ఆటంకంగా మారిందని అన్నారు. తణుకు పట్టణాన్ని గ్రీన్ అండ్ క్లీన్ సిటీగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

తణుకు: ఏపీ సీడ్స్ మహిళా కార్మికుల సమస్యలు పరిష్కరించి వారి సంక్షేమానికి కృషి చేయాలని ఏపీ సీడ్స్ మహిళా వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. శనివారం యూనియన్ నాయకులతో కలిసి ఆయన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు.

పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు



అత్తిలి : ప్రాంతీయ పశువైద్యశాలలో కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు వేస్తున్న పశువైద్యులు

అత్తిలి: పశువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోసిస్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె నరశింహారావు అన్నారు. జూనోసిస్ డే సందర్భంగా అత్తిలి ప్రాంతీయ పశువైద్యశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి వారి సహకారంతో కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. డాక్టర్ నరశింహారావు మాట్లాడుతూ రేబిస్ వ్యాధిని వ్యాక్సిన్ వేయించడం ద్వారా నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా 42 పెంపుడు కుక్కలకు టీకాలు వేసినట్లు చెప్పారు. అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కె.నాగరాజు మాట్లాడుతూ పందుల ద్వారా మెదడువాపు వ్యాధి వస్తుందని, ఆంత్రాక్స్ వ్యాధి సోకిన గొర్రెలు, మేకల మాంసం తినడం ద్వారా ఆంత్రాక్స్ వ్యాధి మనుషులకు వస్తుందన్నారు. బాగా ఉడికించిన మాంసం, కాచిన పాలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటావిజేత నాగరాజు, టీడీపీ, జనసేన నాయకులు ఆనాల ఆదినారాయణరావు, దాసం ప్రసాద్, మాజీ ఎంపీపీ మక్కా సూర్యానారాయణ, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు బండి గంగాధరం, వి కొండబాబు, ప్రవీణ్‌రాయ్, వర్థినీడి వెంకటశివ, పి సోమసుందర్, మద్దంశెట్టి చంద్రశేఖర్, చిటకన ఏడుకొండలు, యాతం రాంబాబు పాల్గొన్నారు.

182 కుక్కలకు టీకాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా శనివారం పట్టణ ప్రాంతీయ పశు వైద్యశాలలో 182 కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు ఎల్‌కే సుధాకర్, మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ, వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ బి.అనిల్ కుమార్‌లు ప్రారంభించారు. జెడ్పీ హై స్కూల్‌లో విద్యార్థులకు జంతు సంక్రమిత వ్యాధులు, నివారణ చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల పశు శస్త్ర చికిత్సకులు, పారా సిబ్బంది, పశు సంవర్ధక సహాయకులు, వైద్యులు మహేష్, దివ్యశ్రీ, సునీల్, విజయ్ కుమార్, రాఘవేంద్రరావులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం (టీఓసీ): టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సుధాకర్



తాడేపల్లిగూడెం (టీఓసీ): కుక్కకు టీకాలు వేస్తున్న వైద్యుడు

పట్టింపాలెంలో..

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పట్టింపాలెం పశువైద్యశాల వద్ద శనివారం పెంపుడు కుక్కలకు యాంటి రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. పశువైద్యాధికారి విజయ్ కుమార్ పర్యవేక్షణలో కుక్కలకు టీకాలు వేశారు. పెంపుడు కుక్కలకు విధిగా యాంటి రేబిస్‌టీకాలు వేయిస్తే, వాటి నుంచి నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించవని విజయకుమార్ అన్నారు. అనంతరం వీరంపాలెం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, నీలాద్రిపురం గ్రామాల నుంచి కుక్కలకు టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల విస్తృత తనిఖీలు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో ఆచంట, పెనుగొండ మండలాల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా శనివారం ఎరువులు, పురుగు మందులు షాపులను ఆకస్మిక తనికీలు నిర్వహించారు. పెనుగొండ మండలంలో పలు దుకాణాల్లో సరైన రికార్డులు, స్టాకు వివరాలు సక్రమంగా లేవంటూ రూ.31.57 లక్షల విలువైన 10.2 టన్నుల పురుగు మందు విక్రయాలను నిలిపివేశారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగానే వీటిని నిర్వహించినట్లు వ్యవసాయశాఖాధికారులు తెలిపారు. పెనుగొండ మండలంలో విజయనగరం జిల్లాకు చెందిన వ్యవసాయ సహాయ సంచాలకులు కే మహరాజ్, విజిలెన్స్ ఎస్సై టి జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. స్టాకులు, రికార్డులపై సరైన ఆధారాలు లేకపోవడంతో విక్రయాలు నిలిపివేయాలంటూ ఆయా దుకాణ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. పెనుగొండలో నిర్వహించిన తనిఖీల్లో ఉన్నతాధికారులతో పాటు మండల వ్యవసాయాధికారి పి స్పందన, జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయపు టెక్నికల్ ఏఓ కే కృష్ణకాంత్ పాల్గొన్నారు. ఆచంటలోనూ తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, స్టాకులపై సరైన సమాచారం ఇవ్వడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

తణుకు టౌన్: పాఠశాలలో చదివే విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని తణుకు మండల విద్యాశాఖాధికారి 2 హైమావతి కోరారు. శనివారం తణుకు పైడిపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు ఉపయోగించుకుని ఉన్నత చదువుల్లో రాణించాలని కోరారు. పిల్లల చదువుల పట్ల పాఠశాల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశానికి పాఠశాల హెచ్‌ఎం ఎం ఏడుకొండలు అధ్యక్షత వహించగా సైకాలజిస్ట్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మూర్తి, రామలక్ష్మి, ఏసుకృప, రామకృష్ణ, స్వరూపరాణి, జయరాజు, ప్రసాద్, విజయ కుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగిరపర్చండి

పాలకోడేరు: పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలని ప్రజాప్రతినిధులను ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) కోరారు. పాలకోడేరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ చంటిరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు నిలిచిన అభివృద్ధి పనులు ఇక నుంచి జరగాల్సిన అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపడతామని అందరూ సహకరించాలని కోరారు. విస్సాకోడేరు గ్రామ సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని లంబాడి పుంత ఆనుకుని ప్రవహిస్తున్న పంట కాలువకు నీరు విడుదల అయ్యే సమయంలో బలహీనంగా ఉండడం వల్ల నివాసిత ప్రాంతాల్లోకి నీరు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గ్రామంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, దీనివల్ల ఇబ్బందులకు గురవుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు నెలలకోసారి జరిగే ఈ సర్వసభ్య సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనడం లేదని అధికారులందరూ పాల్గొనేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీ తులసి మాట్లాడుతూ గ్రామంలో రెండు చోట్ల ఇనుప విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, వర్షాలు కురిసేటప్పుడు నీరు నిల్వ ఉండడం వల్ల ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని, దీనిపై చర్యలు చేపట్టాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అధికారులు చర్యలు చేపడతామని చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సోడదాసి నరేష్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని నింపేందుకు రోటరీ కృషి

తణుకు టౌన్: యువతలో క్రీడలపై ఆసక్తిని పెంచేలా రోటరీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. శనివారం రాత్రి తణుకు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు జీ సుదాకర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తణుకు రోటరీ క్లబ్ ఈసంవత్సరం థీమ్‌గా క్రీడలను తీసుకుని నియోజకవర్గంలోని యువతకు వివిధ క్రీడాంశాలలో శిక్షణ ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. దక్షిణ మధ్య రైల్వే ఆపరేషనల్ మేనేజర్ ఎం దినేష్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సాహించేందుకు రోటరీ కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో తణుకు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గంతో రోటరీ అసిస్టెంట్ జిల్లా గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా ఆనందం మస్తాన్‌రావు (బాబీ), కార్యదర్శిగా కఠారి సిద్ధార్థ, ఉపాధ్యక్షుడిగా కలగర వెంకట కృష్ణారావు, కోశాధికారిగా వీవీ హనుమంతరావు, సర్వీస్ చైర్‌పర్సన్‌గా బసవ రామకృష్ణ, సభ్యత్వ చైర్‌పర్సన్‌గా పుట్టా సత్యనారాయణ, పబ్లిక్ ఇమేజ్ చైర్‌గా మల్లిన అరుణ సారథి, ఫౌండేషన్ చైర్‌గా జీఎస్ సుబ్రహ్మణ్యం, పోలియో చైర్‌గా పోతుల శ్రీనివాసరావు, సార్జెంట్ ఎట్ ఆర్మ్‌గా ఏ కాశీ విశ్వనాథం, ఆన్‌లైన్ టూల్‌గా గమిని వెంకట రవి కృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు.